శారీరక, మానసికోల్లాసానికి క్రీడలు దోహదం

● నాగార్జున సాగర్ ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి

అనుముల మండలం పేరూరులో కబడ్డీ విజేతలకు బహుమతులను అందజేస్తున్న ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి

హాలియా, మార్చి 11 : క్రీడలు శారీరక దృఢత్వానికి, మానసికోల్లాసానికి దోహదపడుతాయని నాగార్జున సాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి అన్నారు. మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని పేరూరు గ్రామంలో స్వయంభూ సోమేశ్వరస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి గ్రామీణ కబడ్డీ పోటీల విజేతలకు ఆదివారం రాత్రి బహుమతులు అందజేశారు. కల్లూరు జట్టు మొదటి బహుమతి, అనుముల ద్వితీయ, సయ్యద్ మెమోరియల్ జట్టు తృతీయ, తిరుమలగిరి నాలుగవ, మదారిగూడెం ఐదో బహుమతి, కొట్టాల ఆరు, చిల్కాపురం ఏడు, కోదండాపురం ఎనిమిది, ఆలగడప తొమ్మిది, పేరూరు జట్లు పదో బహుమతి గెలుచుకున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రిక్కల కొండారెడ్డి, నాయకులు కాకునూరి నారాయణ, కుందూరు వెంకట్‌రెడ్డి, రావుల శ్రీనివాస్ యాదవ్, మల్లిరెడ్డి లింగారెడ్డి, రావుల చినభిక్షం, పెద్దిరెడ్డి పాల్గొన్నారు.

హాలియా సీతారామాంజనేయ స్వామి ఆలయంలో పూజలు

హాలియాలోని సీతారామాంజనేయ స్వామి దేవస్థానం పుష్కర కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం ఆలయంలో అష్టబంధన మహాలయ సంప్రోక్షణ కార్యక్రమం చేపట్టారు. పూజల్లో ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు ఎమ్మెల్యేను సన్మానించారు.

విద్యార్థుల్లో ప్రతిభ వెలికితీతకే ప్రేరణ

● ఎంజీయూ వీసీ సీహెచ్ గోపాల్‌రెడ్డి

ప్రేరణ ప్రతిభ పోటీల పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంజీయూ వీసీ గోపాల్‌రెడ్డి, నిర్వాహకులు ఆకుల రవి

రామగిరి, మార్చి 11 : విద్యార్థుల్లో దాగి ఉన్న కామర్స్ సబ్జెక్టును వెలికితీసి ప్రతిభకు పునాది పెట్టిందుకే ప్రేరణ ప్రతిభా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంజీయూ వీసీ సీహెచ్ గోపాల్‌రెడ్డి అన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కామర్స్ విద్యార్థులకు ఎంజీయూలో నిర్వహించే ప్రేరణ పోటీల పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 14నుంచి 20వరకు కళాశాలల్లో పోటీలు నిర్వహించాలన్నారు. కళాశాలల్లో ఎంపికైన విద్యార్థులకు ఈ నెల 16న వర్సిటీ స్థాయిలో ఎంజీయూలో పోటీలుంటాయని తెలిపారు. వర్సిటీ స్థాయిలో విజేతలైన విద్యార్థులకు రాష్ట్ర స్థాయిలో ఈ నెల 23న పోటీలు ఉంటాయన్నారు. పోటీల్లో వ్యాసరచన, వక్తృత్వం, బిజినెస్ క్విజ్, ఫేస్ పెయింటింగ్, రంగోళి పోటీలుంటాయని చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ అల్వాల రవి, ప్రేరణ ప్రతిభ పోటీల కన్వీనర్ కౌత్ శ్రీదేవి, నిర్వాహకులు ఆకుల రవి, ఓఎస్‌డీ కె.అంజిరెడ్డి, సైన్స్, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్స్ ప్రేమ్‌సాగర్, మారం వెంకటరమణా రెడ్డి, అరుణప్రియ పాల్గొన్నారు.

హోటళ్లు, రెస్టారెంట్లపై రైడ్

● 40 సిలిండర్లు సీజ్.. 6ఏ కేసులు నమోదు

నల్లగొండలో హోటళ్లలో స్వాధీనం చేసుకున్న డొమెస్టిక్ సిలిండర్లు

నల్లగొండ, మార్చి 11 : జిల్లా కేంద్రంలోని పలు హోటళ్లు, రెస్టారెంట్లలో సివిల్ సప్లయ్ యంత్రాంగం సోమవారం రైడ్ చేసింది. 40 సిలిండర్లు సీజ్ చేసి బాధ్యులపై 6ఏ కేసులు నమోదు చేసింది. సివిల్ సప్లయ్ జిల్లా అధికారి వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ నల్లగొండ, మిర్యాలగూడ, నకిరేకల్ డీటీఎస్‌లు స్వామి, జావేద్, జ్యోతి ఈ దాడులు నిర్వహించారు. ఆయా హోటళ్లలో కమర్షియల్ సిలిండర్లకు బదులు డొమెస్టిక్ సిలిండర్లు వాడుతున్నట్లు గుర్తించారు. వాటిని సీజ్ చేసి సదరు హోటళ్లు, రెస్టారెంట్ల యాజమాన్యంపై 6ఏ కేసులు నమదు చేశారు. ప్రభుత్వం రూ.500కే సిలిండర్ ఇస్తున్న నేపథ్యంలో డొమెస్టిక్ సిలిండర్లు ఇంటి అవసరాలకు మాత్రమే వాడుకోవాలని, వ్యాపార అవసరాలకు వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని డీసీఎస్‌ఓ వెంకటేశ్వర్లు హెచ్చరించారు.

దరఖాస్తుదారు ఇంటికే వెళ్లి భూమి రిజిస్ట్రేషన్

● తాసీల్దార్ దివ్యారెడ్డి ఔదార్యం

గన్యానాయక్‌తండాకు వెళ్లి భూమి రిజిస్ట్రేషన్ చేస్తున్న తాసీల్దార్ దివ్యారెడ్డి

కొండమల్లేపల్లి, మార్చి 11 : ఆఫీసుకు రాలేని వృద్ధురాలి ఇంటికి తాసీల్దార్ స్వయంగా వెళ్లి భూమిని రిజిస్ట్రేషన్ చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. మండలంలోని గన్యానాయక్‌తండాకు చెందిన గేమ్యా నాయక్ ఇటీవల మరణించాడు. గేమ్యానాయక్ పేరున 32 గుంటల వ్యవసాయ భూమి ఉండగా.. అతని భార్య రమావత్ లాలీ అనారోగ్యంతో మంచానికే పరిమితం కావడంతో స్థానిక వీఆర్‌ఏ తాసీల్దార్ ఘనపురం దివ్యారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దాంతో తాసీల్దార్ సోమవారం లాలీ ఇంటికి వెళ్లి వేలి ముద్రలు తీసుకొని సదరు భూమికి విరాసత్ పట్టా చేశారు. ఆమె వెంట ధరణి ఆపరేటర్ మహేశ్, శ్రీనివాస్‌యాదవ్ ఉన్నారు. తాసీల్దార్‌ను గ్రామస్తులు అభినందించారు.

ఉపాధి హామీ పనులపై ఓపెన్ ఫోరం

ఓపెన్ ఫోరంలో పాల్గొన్న అధికారులు, ఉపాధి హామీ సిబ్బంది

చందంపేట, మార్చి 11 : మండలంలోని 28 గ్రామపంచాయతీల్లో 2022-2023 ఆర్థిక సంవత్సరంలో రూ.3.67కోట్లతో చేపట్టిన ఉపాధి హామీ పనులపై ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఓపెన్ ఫోరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారం రోజులుగా గ్రామాల్లో చేపట్టిన సామాజిక తనిఖీలో సేకరించిన వివరాలపై చర్చ చేపట్టారు. అనంతరం డీఆర్‌డీఏ అదనపు పీడీ నవీన్‌కుమార్ మాట్లాడుతూ ఉపాధి హామీ పనులను పకడ్బందీగా నిర్వహించాలని, అవినీతికి తావు లేకుండా చూడాలని సంబంధిత అధికారులు, సిబ్బందికి సూచించారు. పలు గ్రామాల్లో జరిగిన అవకతవకపై రికవరీకి ఆదేశించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ నూన్సావత్ పార్వతి, జడ్పీటీసీ బుజ్జి లచ్చిరాంనాయక్, అంబుడ్స్‌మన్ గౌరి, విజిలెన్స్ అధికారి ఫయాజ్, ఎంపీడీఓ లక్ష్మి, క్వాలిటీ కంట్రోల్ అధికారి అశ్వద్దీన్, క్లస్టర్ ఏపీడీ రవీందర్, ఎస్ఆర్‌పీ జె.రమేశ్, ఇన్‌చార్జి ఏపీఓ శంకర్‌నాయక్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పేదల వద్దకే కార్పొరేట్ స్థాయి వైద్యం

● నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

కట్టంగూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీరేశం

కట్టంగూర్, మార్చి 11 : సర్కార్ దవాఖానలను రాష్ట్ర ప్రభుత్వం అత్యాధునిక వసతులతో తీర్చిదిద్ది పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తున్నదని నకిరేకల్ ఎమ్మెల్యే వీముల వీరేశం అన్నారు. మండలంలోని ముత్యాలమ్మగూడెం, పరడ, ఈదులూరు, మునుకుంట్ల, పందనపల్లి, అయిటిపాముల, బొల్లేపల్లి, ఇస్మాయిల్‌పల్లి గ్రామాల్లో రూ.90లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. కట్టంగూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రూ.1.56 కోట్లతో నిర్మించిన దవాఖాన భవనాన్ని ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అధిక నిధులు కేటాయిస్తున్నన్నారు. వైద్య సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ కొండల్‌రావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ లోకసాని వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీపీ జెల్లా ముత్తిలింగయ్య, తాసీల్దార్ గుగులోతు ప్రసాద్, ఎంపీడీఓ పెరుమాళ్ల జ్ఞానప్రకాశ్ రావు, వైద్యాధికారి శ్వేత, మాజీ ఎంపీపీ కొండ లింగస్వామి, మాజీ జడ్పీటీసీ మాదయాదగిరి, నాయకులు సుంకరబోయిన నర్సింహ, సుక్కయ్య, సైదులు, వెంకన్న, నారాయణ, అంజయ్య, యాదగిరి, సుధీర్ రెడ్డి, వెంకట్‌రెడ్డి, దానయ్య, సాగర్, శేఖర్ పాల్గొన్నారు.

చిట్యాలలో మంచినీటి ట్యాంకు ప్రారంభం

చిట్యాల : పట్టణంలో చెత్త సేకరణ వాహనాన్ని, మంచినీటి ట్యాంకును మిర్యాలగూడ ఎమ్మెల్యే బి.లక్ష్మారెడ్డితో కలిసి ఎమ్మెల్యే వీరేశం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా మున్సిపాలిటీ వాహనాలకు అందజేయాలన్నారు. అంతకు ముందు కనకదుర్గమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కూరెళ్ల లింగస్వామి, కౌన్సిలర్లు పూలమ్మ, జయమ్మ, పద్మ, మౌనిక, లింగస్వామి, కృష్ణ, కో ఆప్షన్ సభ్యుడు పాటి మాధవరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పంట నష్ట పరిహారం చెల్లించాలి

● రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్

సమావేశంలో మాట్లాడుతున్న సుదర్శన్

మిర్యాలగూడ, మార్చి 11 : నీళ్లు లేక ఎండిపోయిన పొలాలకు పంట నష్టపరిహారం అందించి రైతులను ఆదుకోవాలని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డితో కలిసి సోమవారం మీడియాతో ఆయన మాట్లాడారు. భూగర్భ జలాలు అడుగంటిపోయి సాగునీరు లేక నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లో వరి పంట పూర్తిగా ఎండిపోయిందని, తెగుళ్లతో మిర్చి పంట దెబ్బతిన్నదని తెలిపారు. ప్రభుత్వం నష్టపోయిన పంటల వివరాలను సేకరించి రైతులకు పరిహారం అందించాలని కోరారు. రాష్ట్రంలో రైతుల పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నదని, నీటిని విడుదల చేసే అవకాశం సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేశ్, రైతు సంఘం జిల్లా నాయకుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, సీఐటీయూ జిల్లా నాయకుడు మల్లు గౌతంరెడ్డి పాల్గొన్నారు.

బీజేపీని ఓడించేందుకు కలిసి పోరాడుదాం : జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ, మార్చి 11 : త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికలు దేశానికి, దేశ ప్రజల భవిష్యత్తుకు కీలకమని.. ఈ ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు కలిసికట్టుగా పోరాడుదామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో లెనినిజం - పునాదులు అనే అంశంపై సోమవారం జరిగిన నియోజకవర్గ స్థాయి స్టడీ సర్కిల్‌లో ఆయన మాట్లాడారు. రాజకీయ లబ్ధి కోసం బీజేపీ ప్రజల మధ్య మత విద్వేషాలు సృష్టిస్తున్నదన్నారు.

పెద్దగట్టులో అధికారుల పరిశీలన

పెద్దఅడిశర్లపల్లి, మార్చి 11 : నల్లమల అటవీ ప్రాంతంలో యురేనియం అలజడి నేపథ్యంలో పెద్దగట్టు గ్రామాన్ని జిల్లా మైనింగ్ ఏడీ వెంకటేశ్వర్లు, తాసీల్దార్ శ్రీనివాస్ సోమవారం సందర్శించారు. గ్రామంలో తిరిగి ఈ ప్రాంతంలో చేపడుతున్న సర్వే, యూసీఐఎల్ అధికారుల సర్వేపై ఆరా తీశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు హెలికాప్టర్ చక్కర్లు కొట్టిన విషయాన్ని, గతంలో యురేనియం తవ్వకాలను వ్యతిరేకించిన విషయాలను వెల్లడించారు. అదేవిధంగా నాగార్జున సాగర్‌లోని విజయవిహార్‌లో నెల రోజుల నుంచి యూసీఐఎల్ అధికారులు ఉంటూ సాగర్ వెనుక జలాల్లో సర్వే చేపడుతున్నట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు. సాగర్‌కు ఆనుకుని ఉన్న ఆంధ్రా సరిహద్దులో శాంపిల్ సేకరణ కూడా కొనసాగుతున్నట్లు తెలుస్తుంది. ఇక్కడి వివరాలను జిల్లా అధికారులకు తెలియజేసినట్లు స్థానిక అధికారులు పేర్కొన్నారు.

పంట పొలాల పరిశీలన

నకిరేకల్, మార్చి 11 : మండలంలోని నోముల గ్రామంలో అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో సోమవారం పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి అంబటి చిరంజీవి మాట్లాడుతూ నీళ్లు లేక ఎండిన పంటలకు ఎకరానికి రూ.25 వేలు నష్టపరిహారమివ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పసుపులేటి సోమయ్య, నర్సయ్య, మురళి, వెంకటయ్య, వెంకటేశ్వర్లు, మహిళా రైతులు నారగోని లక్ష్మి, శోభ, ఆండాలు, భారతమ్మ పాల్గొన్నారు.

రేషన్ డీలర్లు ఆథరైజేషన్ రెన్యువల్ చేయించుకోవాలి

చందంపేట, మార్చి 11 : డివిజన్ పరిధిలోని రేషన్ డీలర్లు తమ ఆథరైజేషన్‌ను రెన్యువల్ చేయించుకోవాలని డీటీసీఎస్ హన్మంతు శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ వివిధ మండలాల్లోని రేషన్ డీలర్ల ఆథరైజేషన్ గడువు మార్చి 31 వరకు ఉన్నదని తెలిపారు. గడువు పూర్తయిన వారు బ్యాంక్ చాలానా కట్టి రెన్యువల్ చేయించుకోవాలని సూచించారు. ఈకేవైసీ కూడా నమోదు చేయాలన్నారు. రేషన్ కార్డులో పేరున్న ప్రతి కార్డుదారుడి ఈకేవైసీ నమోదు చేయించాలని పేర్కొన్నారు.

వివాదాస్పద స్థలం పరిశీలన

మర్రిగూడ, మార్చి 11 : మండల కేంద్రంలోని హైస్కూల్ సమీపంలో కబ్రస్థాన్ దారి స్థలాన్ని మైనారిటీ నాయకులు, సమీప రైతుల ఫిర్యాదు మేరకు తాసీల్దార్ బక్క శ్రీనివాస్ సోమవారం పరిశీలించారు. డొంక బాటకు ఇరువైపులా ఉండే రైతులకు నోటీసులు అందజేసి విచారణ చేస్తామని తెలిపారు. ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఎంపీపీ మెండు మోహన్‌రెడ్డి, మండల కో ఆప్షన్ మెంబర్ ఎండీ.యాకూబ్‌అలీ, మాజీ ఎంపీటీసీ బాలయ్య, మాజీ సర్పంచ్ మాస నీలిమా చంద్రశేఖర్ ఉన్నారు.

ప్రజలకు మరింత సేవ చేయడం కోసమే గ్రీవెన్స్

● జిల్లా ఎస్పీ చందనా దీప్తి

నీలగిరి, మార్చి 11 : పోలీస్ శాఖను ప్రజలకు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా గ్రీవెన్స్ ఏర్పాటు చేసి ప్రజా సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తున్నామని జిల్లా ఎస్పీ చందనా దీప్తి అన్నారు. గ్రీవెన్స్ డేలో భాగంగా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 25 మంది నుంచి దరఖాస్తులను స్వీకరించి వారి సమస్యలను తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశించారు. భూ సమస్యలు, అధిక వడ్డీ వసూలుపై ఎక్కువ ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ అధికారులు స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై వేగంగా స్పందించాలన్నారు. చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడుతూ శాంతి భద్రతలకు భంగం కలిగించే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

త్రిపురారం, మార్చి 11 : మండలంలోని అంజనపల్లి, సత్యంపాడు తండా, రూప్లాతండా, బొర్రాయిపాలెం గ్రామాల్లో ఉపాధి హామీ నిధులు రూ.25లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్ల పనులను ఎంపీపీ అనుముల పాండమ్మ, జడ్పీటీసీ భారతి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు అవిరెండ్ల వీరయ్య, కల కొండ వెంకటమ్మ, జయరాంనాయక్, పంచాయతీ కార్యదర్శులు పల్లవి, ఝాన్సీ, నాయకులు పాల్గొన్నారు.

13న ఈస్టర్ కంటాట

నకిరేకల్, మార్చి 11 : పట్టణంలోని రాజీవ్ గాంధీ మినీ స్టేడియంలో ఈ నెల 13న సాయంత్రం 6గంటలకు ఈస్టర్ కంటాట (క్రీస్తు ప్రభువుని సిలువ మరణ పునరుద్ధాన నాటిక) కార్యక్రమం నిర్వహించనున్నట్లు నకిరేకల్ ఆల్ పాస్టర్స్ అండ్ కమిటీస్ కన్వీనర్ కడియం నోవాహు కృపాకర్ తెలిపారు. సోమవారం పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో ఈస్టర్ కంటాట కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నకిరేకల్ ఆల్ పాస్టర్స్ అండ్ కమిటీస్ సహకారంతో గ్లోబల్ క్రిస్టియన్ ఎంపవర్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వేముల వీరేశం ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు తెలిపారు.

సీఈఐఆర్ టెక్నాలజీ సహాయంతో మొబైల్ గుర్తింపు

అడవిదేవులపల్లి, మార్చి 11 : మండల కేంద్రానికి చెందిన యడవెల్లి నరేందర్ గత నెల 20న మిర్యాలగూడ నుంచి అడవిదేవులపల్లికి వస్తుండగా మార్గమధ్యలో రూ.22వేల విలువైన తన మొబైల్‌ను పోగొట్టుకున్నాడు. దీనిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. సీఈఐఆర్ టెక్నాలజీ సహాయంతో ట్రాక్ చేసి మొబైల్‌ను గుర్తించి బాధితుడికి అందచేశామని ఎస్ఐ హరిబాబు తెలిపారు. ఎవరైనా మొబైల్ పోగొట్టుకుంటే ఫిర్యాదు చేస్తే సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా ట్రాక్ చేసి పట్టుకుంటామని అన్నారు.

రంజాన్‌ను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

● శాంతి సంఘం సమావేశంలో ఏఎస్‌పీ రాములునాయక్

నల్లగొండలో మాట్లాడుతున్న ఏఎస్పీ రాములునాయక్

రామగిరి, మార్చి 11 : రంజాన్ ఉపవాస దీక్షలు, పండుగను ప్రశాంత వాతావరణంలో శాంతియుతంగా జరుపుకోవాలని జిల్లా అడిషనల్ ఎస్‌పీ రాములునాయక్ సూచించారు. నల్లగొండలోని సంపూర్ణ గార్డెన్స్‌లో మత పెద్దలు, శాంతి సంఘం సభ్యులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పరస్పరం మతాలను గౌరవించుకుంటూ పండుగ జరుపుకోవాలని, మత సామరస్యానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని అన్నారు. మత ఘర్షణలకు సంబంధించిన వార్త ఏదైనా సోషల్ మీడియాలో వస్తే నమ్మవద్దని సూచించారు. అలాంటి వాటిపై పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఏమైనా సంఘటనలు చోటు చేసుకుంటే వెంటనే 100కు ఫోన్ చేసి తెలుపాలని సూచించారు. మసీదుల వద్ద పటిష్టమైన భద్రత, నిఘా ఉంచుతామన్నారు. నమాజ్ సమయంలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని ట్రాఫిక్ సీఐకి ఆదేశాలు జారీచేశారు. షాపింగ్ మాల్స్ వద్ద షీ టీమ్స్ బృందాలతో నిఘా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో డీఎస్‌పీ శివరాంరెడ్డి, వన్ టౌన్, టూ టౌన్ సీఐలు, ఎస్ఐలు, శాంతి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలి : డీఎస్పీ రాజశేఖర్‌రాజు

మిర్యాలగూడ, మార్చి 11 : పండుగలను ప్రజలు మతాలకు అతీతంగా శాంతియుతంగా జరుపుకోవాలని డీఎస్పీ పి.రాజశేఖర్‌రాజు అన్నారు. రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా పట్టణంలోని టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టాన్ని అతిక్రమించకుండా పండుగలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో సీఐలు సుధాకర్, నాగార్జున, ఎస్ఐలు రాంబాబు, కృష్ణయ్య, ట్రాఫిక్ ఎస్ఐ మోహన్, ముస్లిం మత పెద్దలు, కౌన్సిలర్లు, హిందూ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులపై దృష్టి సారించాలి : కలెక్టర్

ప్రజావాణిలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ హరిచందన

నల్లగొండ, మార్చి 11 : ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారం, ప్రభుత్వ పథకాల సత్వర అమలుపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులను తన వద్దకు పిలిపించుకొని ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం కింద అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ పథకం గురించి పెద్ద ఎతు న అవగాహన కల్పించాలని సూచించారు.

పదో తరగతి మెటీరియల్ ఆవిష్కరణ

రామగిరి : ఆసరా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో తయారు చేసిన పదో తరగతి విద్యార్థులకు అవసరమైన స్టడీ మెటీరియల్‌ను కలెక్టర్ దాసరి హరిచందన సోమవారం గ్రీవెన్స్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సేవా సంస్థ అధ్యక్షుడు మేడి హరికృష్ణ, ఇరుగు మధు, ఎల్లాచారి, గిరి, పవన్, నరేశ్, లింగస్వామి పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు ఆదేశాల అమలులో ఎస్‌బీఐ విఫలం : సీపీఎం

నల్లగొండలో ఎస్‌బీఐ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

రామగిరి, మార్చి 11 : ఎలక్టోరల్ బాండ్లను బహిర్గతం చేయాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలు చేయడంలో ఎస్‌బీఐ విఫలమైందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎండీ అబ్బాస్, జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి అన్నారు. ఎలక్టోరల్ బాండ్లను బహిర్గతం చేయాలని నల్లగొండలోని గడియారం సెంటర్‌లో ఎస్‌బీఐ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలతో కుమ్మక్కై ఎలక్టోరల్ బాండ్లను అడ్డగోలుగా తీసుకున్నదన్నారు. ఎస్‌బీఐ బాండ్ల వివరాలను ఎన్నికల కమిషన్‌కు అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు తుమ్మల వీరారెడ్డి, సీహెచ్ లక్ష్మీనారాయణ, ఎండీ సలీం, పి.నర్సిరెడ్డి, తుమ్మల పద్మ, కుంభం కృష్ణారెడ్డి, సత్యనారాయణరెడ్డి, పరిపూర్ణ పాల్గొన్నారు.

ఎలక్టోరల్ బాండ్ల వివరాలు ఇవ్వాలి

మిర్యాలగూడ : ఎలక్టోరల్ బాండ్ల వివరాలను సుప్రీంకోర్టుకు సమర్పించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేశ్ డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఎస్‌బీఐ బాండ్ల వివరాలను వెల్లడించకపోవడాన్ని నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో రాజీవ్‌చౌక్ వద్ద ఉన్న ఎస్‌బీఐ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్‌బీఐ ప్రజల బ్యాంకుగా కాకుండా బీజేపీ బ్యాంకుగా వ్యవహరిస్తున్నదన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలను బేఖాతరు చేయడం క్షమించరాని నేరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవినాయక్, మల్లు గౌతంరెడ్డి, నూకల జగదీశ్‌చంద్ర, పరశురాములు, రామ్మూర్తి పాల్గొన్నారు.

ఉద్యోగం రాలేదని యువకుడి ఆత్మహత్య

గిరిష్ (ఫైల్)

డిండి, మార్చి 11 : ఉద్యోగం రాలేదని యువకుడు డిండి ప్రాజెక్టులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం.. డిండి ప్రాజెక్టులో సోమవారం ఓ గుర్తు తెలియని యువకుడి శవాన్ని గుర్తించిన కొందరు పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు జాలర్ల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీయగా.. అతని వద్ద ఆధార్ కార్డు లభించింది. మునుగోడుకు చెందిన చెరుపల్లి గిరీశ్ (29)గా గుర్తించారు. అతని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఉద్యోగం రాలేదని గిరీశ్ కొంత కాలంగా మానసికంగా బాధపడుతున్నాడని అతని సోదరుడు కిరణ్ తెలిపాడు. శ్రీశైలం వెళ్తున్నానని చెప్పి వచ్చాడని, తిరుగు ప్రయాణంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడని పేర్కొన్నాడు. కిరణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యా